వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
బుధవారం, 8 జనవరి 2025

# గోదావరి చెంత ప్రకృతి సోయగాలు

**కరకట్ట వెంబడి విడిది గృహాల ఏర్పాట్లు పూర్తి**

**గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ..!**

**ప్రత్యేక శోభను సంతరించుకున్న భద్రాద్రి !**



భద్రాచలం, జనవరి 07 ( వాయిస్ టు డే): ప్రకృతి పారవశ్యం ...! కనుచూపే మేరలో ఎటుచూసినా పచ్చని పర్యావరణం ...! మనస్సులో ఎంతో ఉత్కంఠను రేకెత్తించే గోదావరి హెూరు ...! రమణీయతతో... ఆత్మీయతతో ... ఆధ్యాత్మికతతో ... ఆహ్లాదంగా ఆనందంగా భక్తులు, పర్యాటకులు గడిపేందుకు భద్రాచలం గోదావరి నది తీరం సుందరంగా ముస్తాబైంది...! పక్క భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం నుంచి వేదమంత్రాలు తన్మయత్వంతో పులకరింప జేస్తుండగా మరో పక్క చూపును ఆకట్టుకునేలా వెలుగులు వెదజిమ్ముతున్న గోదావరి వంతెన కనపడుతుండగా మధ్యలో గోదావరి నుంచి వచ్చి పలకరించే చిరుగాలుల మధ్య భక్తులు బస చేయనున్నారు..! ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ రూపొందించారు. అనుకున్నదే తడువుగా గోదావరి నదీ తీరం వద్ద గూడారాలను సైతం ఏర్పాటు చేశారు. గూడారాలలో గడిపే వారికి గిరిజనుల ఆచార సాంప్రదాయాలు తెలిసేలా, వారి వంటలను రుచి చూసేలా స్టాల్స్ను సైతం. ఏర్పాటు చేశారు. ఈ సారి ఏర్పాట్లలో జిల్లా కలెక్టర్ తన మార్క్ చూపించనున్నారు. దీంతో భద్రాద్రికి వచ్చే భక్తులకు, పర్యాటకులకు భద్రాద్రి రావడానికి తీవ్ర ఉత్సాహం నింపుతుంది.

**కరకట్ట వెంబడి విడిది గృహాల ఏర్పాట్లు పూర్తి !**

భద్రాచలం గోదావరి కరకట్ట వెండి ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రత్యేక గూడారాలతో కూడిన క్యాంపులు అందుబాటు లోకి తెచ్చారు. ఈ క్యాంపు ల చుట్టూ గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా వెదురు కర్రలతో పెన్సింగ్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళ వెలుగు కోసం సోలార్ లైటింగ్ సౌకర్యాన్ని సైతం సిద్ధం చేశారు. భక్తులు తమ అనుభూతులను మర్చిపోకుండా తమ చరవాణి లో బంధించేందుకు ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ సైతం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచి, పర్యాటకుల అభినందనలు అందుకుంటున్నది. వెదురు పందికి కింద కామన్ కిచెన్ ఏర్పాటు చేసిన స్థానిక గిరిజన మహిళలతో వంటకాలు తయారు చేయించి భక్తులకు అందుబాటులోకి తేనున్నారు. తేనే, కరక్కాయ పొడి, గిరిజనుల పాతకాలపు నగలు, వెదురు, వస్తువులు, కుమ్మరి, కమ్మరి వస్తువులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు సంబంధించిన స్టాల్స్ను సైతం ఏర్పాటు చేశారు. పర్యాటకులకు పది మరుగుదొడ్లు, స్నానపు గదులను సైతం చెక్కలు, రేకులతో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ముక్కోటికు వచ్చే భక్తులకు, పర్యాటకులకు ఆధ్యాత్మిక అనుభూతి కలగడంతో పాటు స్థానిక సంస్కతి, ఆహారపు అలవాట్లును పరిచయం చేసే అవకాశం కలగనుంది. ఈ సందర్భంగా పూర్తి అయిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ మంగళవారం సాయంత్రం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం భక్తులకు కనువిందు చేయడానికి ఈ జిల్లా యొక్క చరిత్ర తెలియజేయడానికి ఏరు(రివర్) ఫెస్టివల్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని, ఈ ఫెస్టివల్ లో గిరిజన ఆచార వ్యవహారాలకు సంబంధించిన కళాకృతులు మరియు వంటకాలు, సాంప్రదాయాలకు సంబంధించిన పాతకాలపు ఆభరణాలు, ఔషధ గుణాలకు – సంబంధించిన ఆహార పదార్థాలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి గిరిజన కళలకు సంబంధించిన కళా ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని, 8, 9, 10వ తేదీలలో ప్రత్యేకంగా గిరిజన విద్యార్థిని విద్యార్థులు మరియు ఇతర పాఠశాలకు సంబంధించిన విద్యార్థులచే ప్రత్యేక కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే పర్యాటక దర్శనీయ స్థలాలు గుర్తించి పర్యాటకులు విడిది చేయడానికి కరకట్ట పక్కన విడిది గృహాలు ఏర్పాటు చేశామని, పర్యాటకులు ఇక్కడ బస చేసి మరుసటి రోజు బొజ్జిగుప్ప, కిన్నెరసాని, బెండలపాడు, ఐటీడీఏ లోని గిరిజనులకు సంబంధించిన మ్యూజియం సందర్శించి వెళ్లడానికి ప్రత్యేక ప్యాకేజీ కింద అందరికీ సరసమైన ధరలు రూ.6000లుగా నిర్ణయించి ఈ యొక్క గ్రామాలు పర్యాటకులు సందర్శించే విధంగా వెసులుబాటు కల్పించామని అన్నారు. విడిదీ కేంద్రంలో బస చేసే వారికి గిరిజన వంటకాలు మహిళా సమైక్యల ద్వారా ఏర్పాట్లు చేశామని, భక్తులు తప్పకుండా ఈ యొక్క ప్రదేశాలను సందర్శించి గిరిజన కల్చర్ కు సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకొని తిరిగి మీ గ్రామాలకు వెళ్లాలని ఆయన అన్నారు.

# ఐనవోలు జాతరను విజయవంతం చేయండి

**జాతర అభివృద్ధికి రూ.10 కోట్లు కావాలి**

**అధికారులతో ఎమ్మెల్యే కే.ఆర్ సమీక్ష సమావేశం**




హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీన ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జాతర నిర్వహణ పై జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతరలో వైద్య సేవలు అందించాలని, అంబులెన్సును అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుండి జాతరకు ప్రత్యేక బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా విద్యుత్ శాఖ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను చేయాలన్నారు. రోడ్ల మరమ్మతు చేపట్టాలని, రోడ్లకు ఇరువైపుల పెరిగిన చెట్లను తొలగించాలన్నారు. మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్త్ నిర్వహించాలని అన్నారు. జాతర కు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతరకు వచ్చే మహిళా భక్తులకు స్నానపు గదులు, టాయిలెట్స్ సరిపోను ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తగినన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. జాతర లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మినీ వెహికల్ సిద్ధంగా ఉంచాలన్నారు. ఐనవోలు జాతర ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సమన్వయంతో కృషి చేయాలని, వీఐపీ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. జాతర లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ఆలయంలో శాశ్వత నిర్మాణాలకు నిధులు తీసుకువస్తానని, చారిత్రక ఆలయం కాబట్టి పురావస్తు అధికారులతో మాట్లాడి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆలయ కమిటీ కూడా ఏర్పాటు అయిందన్నారు. మంత్రి సురేఖ తో వీడియో కాల్ ద్వారా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర అభివృద్ధికి రూ.10 కోట్లు కావాలని కోరారు. జాతర అభివృద్ధికి శాశ్వతంగా ఉండేలా స్నానపు గదులు, టాయిలెట్స్, తదితర పనులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత జాతర ను విజయవంతంగా నిర్వహించిన విధంగానే ఈ జాతరను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని, తాగునీటి సరఫరా లో ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేసే దగ్గర నీడ ఉండే విధంగా షెడ్స్ సిద్ధం చేయాలన్నారు. జాతర లో ప్లాస్టిక్ నియంత్రణ కు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా దుకాణదారులకు తెలియజేయాలనీ, ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను విక్రయించినట్లయితే జరిమానా విధించాలన్నారు. జాతర లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

# సమస్య ల వలయం లో తెలంగాణ కాలనీ..

**ఓ కాంగ్రెస్ నేత చేపడుతున్న అక్రమ నిర్మాణలు**

**కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు**

**మాస్టర్ ప్లాన్ ను పరిశీలించి అక్రమ నిర్మాణాల ను తొలగించాలి**

**డ్రైనేజీ ఏర్పాటు చేయాలనీ మంత్రికీ అధికారులకు కాలనీ వాసుల విజ్ఞప్తి**



వరంగల్ ( వాయిస్ టుడే ) జనవరి 07: గ్రేటర్ వరంగల్ 42,వ డివిజన్ రంగాసాయి పేట తెలంగాణ కాలనీ వాసులు సమస్య ల వలయం లో కొట్టు మిట్టడుతున్నారు డైనేజి కోసం కేటాయించిన భూమి లో అక్రమ నిర్మాణాలు చేపట్టడం తో కాలనీ వాసులంతా ఇండక్లలో నుంచి వచ్చే మురుగు నీరుతో వ్యాధులకు గురవుతున్నారు. కాలనీ వాసుల సమస్యలు తీర్చండి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని వరంగల్ మున్సిపల్ కమిషనర్ తో పాటు సంబంధిత అధికారులను ఏడాది క్రితం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించిన కూడా నేటి వరకు అక్కడి సమస్యలు అలాగే ఉండడంతో మంత్రి మాటలను బేఖాతరు చేసినట్టుగా తెలుస్తుంది.

డివిజన్ లో ఓ కాంగ్రెస్ నేత చేపడుతున్న అక్రమ నిర్మాణలు వలన తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతం లో తమకు సదరు కాంగ్రెస్ నాయకుడు ప్లాటింగ్ చేసి డ్రైనేజీ కోసం వెసులు బాటు కల్పించాగా తాము అయన మాటలు నమ్మి ప్లాట్ల ను కొనుగోలు చేశామని, అతనిపై మండి పడుతున్నారు.తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీటి మధ్య జీవిస్తున్నామని తమ సమస్య ఏళ్ల తరబడి అలాగే ఉందని పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కలిసి కాలనీవాసులు గత ఏడాది డిసెంబర్లో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సమస్యపై స్పందించిన మంత్రి తాను తెలంగాణ కాలనీకి వస్తానని చెప్పి, గత ఏడాది డిసెంబర్ 23న వచ్చి అక్కడి సమస్యను పరిశీలించారు. అక్కడి ప్రజలకు డ్రైనేజీ వ్యవస్థ సమస్య తీరుస్తానని హామీ ఇవ్వడమే కాకుండా పక్కనే ఉన్న అపార్ట్మెంట్ నుండి కిందికి బైపాస్ రోడ్డుకు కలిసే విధంగా మోరి నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు ఒకవేళ అపార్ట్మెంట్ వాళ్లు ఒప్పుకోకపోతే వారి యొక్క ఆక్యుపేషన్ సర్టిఫికెట్( ఓసి) ఇవ్వద్దని అధికారులకు చెప్పారు. ఇప్పటికీ ఏడాది కావస్తున్నా ఆ సమస్య అలాగే ఉంది.మోరీల్లో మురుగునీరు పేరుకుపోయి పక్కనే ఉన్నటువంటి గృహాల్లోకి వెళ్లడమే కాకుండా గృహవాసులు తమ ఇండ్లలోకి వెళ్లకుండా రోడ్డుమీదనే మురుగునీరు నిలవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు గృహవాసులయితే తమ ఇండ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లడమే కాకుండా తమ ఇండ్లను అమ్ముతున్నట్లు ఇంటిముందు బోర్డులు పెట్టడం కనిపిస్తుంది.ఈ కాలనీలో ప్లాట్లు చేసి విక్రయించినటువంటి వారు ప్లాన్ ప్రకారం నీరు ఎటు వెళ్లాలో ఉన్నా కూడా పట్టించుకోకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైనట్లు గృహవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ కాలనీకి ఒక్క తెలంగాణ కాలనీ వారు వాడుకునే వాటరే కాకుండా రంగసాయిపేటలోని వాటర్ ట్యాంకు, సగర వీధి, పెరిక వాడ, హరిజనవాడకు చెందిన నీరు కూడా ఇటువైపే రావడం వల్ల ఇక్కడ నీరు నిలిచి తీవ్ర దుర్గంధ భరితమైన పరిస్థితి ఏర్పడింది. ఇక వర్షాకాలం వస్తే ఇంకా పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని కాలనీవాసులు చెబుతున్నారు.ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ ఇచ్చిన హామీని నిలబెట్టేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు తీసుకోవాలని గృహ వాసులు కోరుతున్నారు.



## నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కడియం సమావేశం

**నియోజకవర్గ పరిధిలోని**

**హైవే సమస్యలపై NHAI అధికారులతో చర్చ**

హనుమకొండ, వాయిస్ టుడే: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. హన్మకొండ లోని ఎమ్మెల్యే నివాసంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ జనగామ ఆర్ఓబి నుండి కరుణాపురం వరకు అన్ని గ్రామాలలో సైడ్ డ్రైనేజిలు నిర్మాణం చేశారు కానీ ఆ డ్రైనేజి నీరు బయటకు వెళ్లకుండా గ్రామాలలోకే వస్తుందన్నారు. కావున డ్రైనేజి నీరు బయటకు వెళ్లేలా నిర్మాణం చేపట్టాలని కోరారు. వరంగల్ నుండి జనగామ పట్టణానికి వెళ్లే జంక్షన్ లో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కనుక జంక్షన్ అభివృద్ధి చేయాలని తెలిపారు. జనగామ, సూర్యాపేట ఆర్ఓబి కి ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లు మరియు యూ టర్న్ లు సరిగా లేవని వెంటనే వాటిని సరిచేయాలని తెలిపారు. స్టేషన్ ఘనపూర్, నిండిగొండ, చాగల్, చిన్న పెండ్యాల గ్రామాల్లో సర్వీస్ రోడ్డు చివరి వరకు భారీకేడ్ లు ఏర్పాటు చేయాలని కడియం కోరారు. వీటన్నింటిని స్వయంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని %చీనాూ×% పీడీ హామీ ఇచ్చారు. అలాగే చిన్న పెండ్యాల గ్రామం వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు 27లక్షలు మంజూరు అయ్యాయని త్వరలోనే టెండర్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో NHAI అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శబరిమలై బయలుదేరిన అయ్యప్ప స్వాములు

వరంగల్ ( వాయిస్ టుడే ) జనవరి 07: నగరం లోని రంగాసాయి పేట కు చెందిన అయ్యప్ప స్వాములు అయ్యప్ప దీక్ష ముగించుకొని శబరిమలై కీ బయలు దేరారు. మంగళవారం నాడు రంగా సాయిపేట కు అయ్యప్ప స్వాములు 41 రోజులు ముగించుకొని రంగసాయిపేటలోని రామా లయంతో పాటు మహంకాళి ఆలయం, భవాని శంకర ఆలయం, రామలింగేశ్వర ఆలయాల్లో ఇరుముడులు కట్టుకున్నారు .అనంతరం రైలు ప్రయాణం ద్వారా శబరిమలైకి బయలుదేరారు . ఈ కార్యక్రమంలో బజ్జూరి నెలరాజు గొల్లపెల్లి సుదర్శన్ రాజశేఖర్ మిరియాల శీను కటకం రంజిత్ ఈశ్వర్ సంతోష్ దత్తు సత్యనారాయణ ఈశ్వర్ సాయి ప్రభాకర్ మహేందర్ పెద్ద రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## అమృత నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వరంగల్ ( వాయిస్ టుడే ) జనవరి 07: నగరంలోని భద్రకాళి ఆలయం సమీపంలోని సింహాద్రి గుట్ట పై గల అమృత నరసింహ స్వామి ఆలయంలో మంగళవారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయ పూజారి నాంచర్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అమృత నరసింహ స్వామి లక్ష్మీదేవిలకు అలంకరణలు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పెద్ద సంఖ్యలో భక్తులు సింహాద్రి గుట్ట పైకి తరలివచ్చి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి వెంకటేశ్వర్లు చార్యులు ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నాడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. లక్ష్మీ సమేత అమృత నరసింహస్వామి లు శుక్రవారం నాడు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.